




'అనుబంధాలు' కలిసొచ్చేనా?



ఉద్యమ బంధంతో పురుడు పోసుకున్న బీఆర్ఎస్‌కు కీలకమైన అనుబంధ సంఘాలు క్రమంగా దూరమవుతున్నాయి. అధికారంలో ఉన్న పదేళ్లు తమను పట్టించుకోలేదన్న కారణంతో ఒక్కొక్కటిగా గులాబీకి బైబై చెబుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో అప్పటి టీఆర్ఎస్ అడుగులో అడుగై నడిచిన ఆర్టీసీ, విద్యుత్, సింగరేణిలో కార్మిక సంఘాలు ఇప్పటికే బీఆర్ఎస్‌కు దూరం జరిగాయి. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటంతో ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులు, పట్టభద్రులు కూడా పక్కచూపులు చూశారనే టాక్ ఉంది. బీఆర్ఎస్ 25ఏళ్ల వేడుకలను ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో పార్టీకి దూరమైన అనుబంధ సంఘాలను బీఆర్ఎస్ మళ్లీ చేరదీస్తుందా? పార్టీకి కొత్త ఊపు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందా? అనే చర్చ గులాబీ శ్రేణుల్లో జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

కార్మిక శక్తి, ఉద్యోగుల బలంతో టీఆర్ఎస్ తెలంగాణలో బలమైన పార్టీగా ఆవిర్భవించింది. ఇక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిది. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో సింగరేణి ఏరియా విస్తరించి ఉండగా.. వేలాది మంది కార్మికులు ఆ సంస్థలో పని చేస్తున్నారు. 2003 జనవరి 27న నాటి టీఆర్ఎస్‌కు అనుబంధంగా గోదావరిఖనిలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఆవిర్భవించింది. ఈ సంఘానికి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత గౌరవ అధ్యక్షురాలిగా కొనసాగారు. 2012, 2017లో విజయం సాధించి రెండు పర్యాయాలుగా 11ఏళ్లకుపైగా సింగరేణి గుర్తింపు సంఘంగా కొనసాగింది. అయితే 2023 డిసెంబరు 27వ తేదీన జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీకి అధిష్ఠానం వెనుకడుగు వేసింది. పోటీ చేయాలంటూ టీబీజీకేఎస్ నేతలు ఎంత ఒత్తిడి తెచ్చినా గులాబీ నాయకత్వం పోటీకి ససేమిరా అనడంతో కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పార్టీ మద్దతు లేకున్నా బరిలో నిలిచినప్పటికి కొన్ని చోట్ల గట్టి పోటీ ఇచ్చింది. దీంతో బీఆర్ఎస్ వైఖరిపై టీబీజీకేఎస్ నేతలు అగ్రహం వ్యక్తం చేస్తూ గులాబీ జెండాతో ఉన్న 21ఏళ్ల అనుబంధాన్ని 2024 మార్చి 23న పెద్దపల్లిలో జరిగిన సభతో తెగదెంపులు చేసుకుంది. ఆ తరువాత కొత్త కమిటీలను నిర్మాణం చేసుకుని టీజీబీకేఎస్ స్వతంత్రంగా వ్యవహరిస్తోంది. ఇదే తరహాలో విద్యుత్ రంగంలో కీలకంగా వ్యహరించిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) కూడా బీఆర్‌ఎస్‌తో తెగదెంపులు చేసుకుంది.



ఉద్యమ శక్తులన్నీ ఏకమవుతున్నాయి..

పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు

ఉద్యమం సమయంలో కేసీఆర్‌తో కలిసి నడిచిన కార్మిక సంఘాలు కొన్ని కారణాలతో దూరమయ్యింది వాస్తవమే. కాంగ్రెస్ పాలన, ప్రజలను హామీల పేరుతో చేసిన మోసాన్ని గమనించిన సంఘాలు.. తిరిగి కేసీఆర్‌తో కలిసి నడిచి ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే దూరమైన కార్మిక సంఘాలను దగ్గరికి చేర్చుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాం. పట్టభద్రులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలన్ని కూడా కేసీఆర్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రజల అకాంక్ష మేరకు కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయటమే లక్ష్యంగా ఉద్యమ శక్తులన్నీ ఏకమవుతున్నాయి.

బీఆర్ఎస్‌కు దూరమైన కార్మిక, ఉద్యోగ సంఘాలు

- గతంలోనే గుడ్‌బై చెప్పిన సింగరేణి సంఘం టీబీజీకేఎస్, విద్యుత్ శాఖలోని టీఆర్‌వీకేఎస్
- ఎన్నికలకు ముందే తెగదెంపులు చేసుకున్న టీఎంయూ
- ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంతో మరింత ప్రభావం
- నాటి ప్రత్యేక ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన సంఘాలు
- రజతోత్సవాల వేళ వాటిని దగ్గరకు చేర్చుకునే ప్రణాళిక లేదనే చర్చ

2004 నుంచి బీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న ఈ సంఘానికి కూడా ఎమ్మెల్సీ కవిత గౌరవ అధ్యక్షురాలిగా కొనసాగారు. అయితే గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదంటూ ఆ సంఘం నేతలు అగ్రహం వ్యక్తం చేస్తూ గతేడాది జూలై 3న బీఆర్ఎస్‌తో ఉన్న తమకున్న అనుబంధాన్ని రద్దు చేసుకుంటున్నట్లుగా ప్రకటించారు. ఇక తెలంగాణ ఉద్యమంలో భాగంగా చేపట్టిన సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికుల కీలకమైందిగా చెబుతారు. తెలంగాణ ఉద్యమానికి అండగా తెలంగాణ మజ్దూర్ సంఘం (టీఎంయూ) ఏర్పడింది. హరీష్‌రావు టీఎంయూ గౌరవాధ్యక్షుడిగా కొనసాగారు. 2019లో ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం సమ్మెబాట పట్టారు. సుమారు 38మంది ఉద్యోగులు ఈ ఉద్యమంలో మృతి చెందారు. అయినప్పటికి ప్రభుత్వం దిగిరాలేదు. చివరికి కార్మిక సంఘాలే దిగివచ్చాయి. ప్రగతిభవన్‌లో అప్పటి సీఎం కేసీఆర్ కొందరు కార్మికులను పిలిచి భోజనం పెట్టించారు. ఇక యూనియన్ల గోల వద్దని చెప్పడంతో ఆర్టీసీలో బీఆర్ఎస్‌కు అనుబంధంగా కొనసాగిన టీఎంయూతో పాటు అనేక కార్మిక సంఘాల ఉనికి ప్రశ్నార్థకమైంది. చివరకు గత అసెంబ్లీ ఎన్నికల్లో

మిగతా 7వ పేజీలో...

'భూ భారతి'పై ఎన్నెన్నో ఆశలు

పైలెట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లా వెంకటాపూర్ ఎంపిక

- గ్రామాల్లోకి రెవెన్యూ అధికారులు
- ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు కార్యాచరణ
- మే 31లోపు భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

వెంకటాపూర్/ ములుగు/ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం భూ భారతిపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సుదీర్ఘ కాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు ఇప్పటికైనా పరిష్కారమవుతాయన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు. అయితే భూభారతి చట్టం అమలులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాలను ఎంపిక చేయగా.. ఆ జాబితాలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి ములుగు జిల్లా వెంకటాపూర్‌కు స్థానం దక్కింది. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గతంలో ధరణితో అనేక అవస్థలు ఎదుర్కొన్న రైతులు కొత్తచట్టంతో తమ భూ సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని ఎదురుచూస్తున్నారు. ఈ సమస్యలన్నీ కొత్త చట్టంతో రూపుమాపు తాయని భావిస్తున్నారు. ప్రజలు తమ భూముల స్థితిని ధ్రువీకరించడానికి, కొత్త పోర్టల్ కార్యాచరణ సామర్థ్యాన్ని అధ్యయనం చేయడానికి, రైతులు లేవనెత్తిన ఫిర్యాదులను పరిష్కరించడానికి భూభారతి చట్టం ఉపయోగపడుతుందని తెలుస్తోంది.

గ్రామాలకు వెళ్లి ఫిర్యాదుల స్వీకరణ..

రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాలను సందర్శించనున్నారు. ధరణిలోని లోపాల వల్ల ప్రభావితమైన ప్రజలు, రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఆతర్వాత సంబంధిత అధికారులు ఫిర్యాదులు, విజ్ఞాపన పత్రాల ఆధారంగా క్షేత్రస్థాయిలో ధ్రువీకరణ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. సక్రమంగా ఉంటే భూభారతి

మిగతా 7వ పేజీలో...

చట్టం పరిధిలోకి వచ్చే భూ విస్తీర్ణం

వెంకటాపూర్ మండలంలో 25 గ్రామపంచాయతీలున్నాయి. పది రెవెన్యూ గ్రామాల్లో 13,533 మంది రైతులు భూభారతిని సద్వినియోగం చేసుకోనున్నారు. మండలంలోని 74,667ఎకరాల విస్తీర్ణం గల భూమి భూభారతి చట్టం పరిధిలోకి రానుంది.



భానుడి భగభగ

- రోజురోజుకు పెరుగుతున్న ఎండతీవ్రత
- 42డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- మహబూబాబాద్ జిల్లాలో అత్యధికం
- ఉక్కపోతతో జనం విలవిల
- ఉమ్మడి జిల్లాలో వడదెబ్బతో ముగ్గురి మృతి
- మానుకోట జిల్లాలో ఇద్దరు కన్నుమూత
- కాళేశ్వరాలయంలో పెద్దపల్లి జిల్లా వృద్ధుడు..

వివరాలు 7లో...



ఇంత పెద్ద రోడ్డెందుకు?



పచ్చని పొలం నుంచి నిర్మిస్తున్న రోడ్డు

- పచ్చని పొలాలను ఫణంగా పెట్టి నిర్మాణ పనులు
- అవసరానికి మించి 66 అడుగుల వెడల్పుతో రహదారి
- నోటీసులు ఇవ్వకుండానే భూములు సేకరించారని అంటున్న రైతులు

రేగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిర్మాణం గానీ, విస్తరణ పనులు గానీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే చేపట్టడం సర్వసాధారణం. ఇందుకు ప్రజా రవాణా, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, వాణిజ్య, పర్యాటక అభివృద్ధి తదితర అవసరాలను పరిగణనలోకి తీసుకోవడం సహజం. అయితే.. మండలంలోని బాగిర్దిపేట క్రాస్ రోడ్డు నుంచి బుద్దారం గ్రామ వరకు పచ్చని పొలాల మీదుగా 66 ఫీట్ల వెడల్పుతో వేస్తున్న రోడ్డును చూస్తే విస్మయం కలగక మానదు. దీని లక్ష్యమేమిటో స్పష్టంగా తెలియడం లేదనే చర్చ స్థానికుల్లో జోరుగా సాగుతోంది.

ఎందుకింత ఆసక్తి?

నిత్యం వందలాది సంఖ్యలో కాళేశ్వరం, భూపాలపల్లి సింగరేణికి వాహనాలు తిరిగే పరకాల- భూపాలపల్లి రహదారి 30 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉండగా బాగిర్దిపేట క్రాస్- బుద్దారం రోడ్డుకు ఇంత భారీ స్థాయిలో 66 అడుగుల వెడల్పుతో నిర్మించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఇంత పెద్ద మొత్తంలో పనులు ఎవరి కోసం చేపడుతున్నారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ రోడ్డును నిర్వాసితులకు నోటీసులు ఇవ్వకుండానే భూసేకరణ చేపట్టారని, వారికి పరిహారం కూడా అందలేదని తెలిసింది.

అంతర్యమేమిటో...

బాగిర్తిపేట క్రాస్ నుంచి బుద్దారం గ్రామం వరకు ఏడు కిలోమీటర్ల మేర 65ఫీట్ల వెడల్పుతో రూ. 15కోట్లు వెచ్చించి రోడ్డును నిర్మిస్తున్నారు. బుద్దారం గ్రామ ప్రజలు బాగిర్తిపేట క్రాస్ వరకు గాంధీనగర్ మీదుగా వస్తే 16కిలోమీటర్ల దూరం ఉంటుంది. అలాగే బుద్దారం నుంచి మరో మార్గాన నర్సాపూర్, జూబ్లీనగర్ మీదుగా బాగిర్తిపేట క్రాస్ వరకు రావాలంటే 19 కిలోమీటర్లు ఉంటుంది. బుద్దారం గ్రామానికి రెండు రకాల రోడ్డు మార్గాలు ఉండగా, రైతుల జీవనోపాధి అయిన వరి పొలాలను సేకరించి ఇంత వెడల్పుతో రోడ్డు వేయడంలో అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



మొరం తీయడంతో ఏర్పడ్డ కందకం

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం!

ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. మొరం కొనుగోలు చేసి రోడ్డు పనులకు వినియోగించాల్సింది ఉండగా రైతుల పొలం నుంచి తీసుకుంటున్నాడని పలువురు అంటున్నారు. దీంతో పెద్ద పెద్ద కందకాలు ఏర్పడి పొలంలోకి వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా పనులు చేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

భూ భారతిపై అవగాహన కల్పించాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న భూభారతి రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన మాట్లాడారు. నూతన భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమీక్షించారు. ఈనెల 17 నుంచి 30 వరకు ప్రతి మండలంలో భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు షెడ్యూల్ రూపకల్పన చేయడంతో పాటు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి చట్టంపై డెస్క్ ఏర్పాటుచేసి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు అందజేయాలని సూచించారు. మేలో జిల్లా నుంచి ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాల్సి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ లబ్ధి కోసం నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు. ఈనెల 21 వరకు ఇందిర మ్మ ఇళ్ల జాబితాను అందజేయాలన్నారు. 22 నుంచి 30 తేదీ వరకు ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులను ఎంపిక చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా అశోక్, తిరుపతి



అశోక్, అధ్యక్షుడు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా చిలువేరు అశోక్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి, దేవేంద్ర, తిరుపతి రెడ్డి, ప్రధాన కార్య దర్శిగా తిరుపతి, కార్యదర్శులుగా వీరేశం, బొజ్జ నాయక్, వీరన్న, ప్రభాకర్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా సుద ర్శనం, విజయ, రమణారెడ్డి, లక్ష్మణ్ నాయక్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుదర్శన్, వెంకటే శ్వరాచారి, ఆడిట్ కమిటీ కన్వీ నర్‌గా దేవేందర్‌రెడ్డి, సభ్యులుగా మొండయ్య, జయప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుడు, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి తెలిపారు.

సింగరేణిలో కారుణ్య నియామకాలు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో నూతనంగా చేరిన 12 మందికి కారుణ్య నియామక పత్రాలను ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ వెంకటరామిరెడ్డి మంగళవారం అందించారు. భూపాలపల్లిలోని ఏరియా జీఎం కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా సంస్థలో చేరుతున్న వారు అంకితభావంతో పని చేయాలన్నారు. సింగరేణిలో ఉద్యోగం సాధించడమనేది అదృష్టంగా భావించాలన్నారు. రక్షణతో కూడిన బొగ్గు వెలికితీతలో ప్రధాన భూమికి పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం కవీంద్ర, సివిల్ డీజీఎం రవి, ఇన్ చార్జ్ ఏరియా ఇంజనీర్ అరుణ్ ప్రసాద్, డీవైపీఎం గుండు రాజు, డీవైపీఎం కాంతికుమార్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందిస్తున్న ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ వెంకటరామిరెడ్డి

క్వారీ సూపర్‌వైజర్ హత్య కేసులో జీవిత ఖైదు



నిందితుడు గోగుల విజయ్

మహదేవపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బ్రాహ్మణపల్లిలో 2018లో చోటుచేసు కున్న ఇసుక క్వారీ సూపర్‌వైజర్ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదును విధిస్తూ జిల్లా న్యాయమూర్తి నారాయణబాబు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల మేరకు...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా సీతానాగారం గ్రామానికి చెందిన సంగిశెట్టి కిషోర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బ్రాహ్మణపల్లి ఇసుక క్వారీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తుండేవాడు. 2018లో కిషోర్ స్నేహితుడు, ఇసుక క్వారీ ఇన్‌చార్జి అయిన విజయనగరానికి చెందిన చోవరపు నర్సింహామూర్తి మహదేవపూర్ మండలం ఎడపల్లి గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకోవాలనుకున్నాడు. ఆమెను విజయనగరం తీసుకెళ్లిపోయాడు. ఇందుకు నర్సింహామూర్తి స్నేహితుడైన కిషోర్ సహకరిచాడనే కోపంతో ఆ యువతి తమ్ముడు గోగుల విజయ్ 2018 ఆగస్టు 26న రాత్రి అతడిపై ఇసుక క్వారీ వద్ద గొడ్డలితో నరికి చంపాడు. దీనిపై మృతుడి తండ్రి సంగిశెట్టి దర్గారావు మరుసటి రోజే మహదేవపూర్ పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. దీంతో విజయ్‌పై అప్పటి సీఐగా ఉన్న విజయ్ కుమార్ హత్య కేసు నమోదు చేశారు. తర్వాత సీఐగా బాధ్యతలు స్వీకరించిన రంజిత్ కుమార్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. అనంతరం సీఐగా బాధ్యతలు స్వీకరించిన అంబటి నర్సయ్య చార్జిషీట్ ఫైల్ చేశారు. లైజన్ ఆఫీసర్ గాండ్ల వెంకన్న ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు కె.వినోద్, కె.రమేష్ కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో విజయ్‌కు జీవిత ఖైదుతోపాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి నారాయణబాబు తీర్పునిచ్చారు. ఈ కేసులో సరైన సమయంలో సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టడానికి కృషి చేసిన ప్రస్తుత డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రాంచదర్‌రావు, ఎస్సై పవన్‌కుమార్‌ను, అప్పటి అధికారులను ఎస్పీ కిరణ్‌ఖరే అభినందించారు.

పోలీసుల అదుపులో
హత్య కేసు నిందితుడు?

కాటారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఆదివారంపేటల వృద్ధురాలు మల్లుబాయిని గొడ్డలితో కొట్టి దారుణంగా హత్య చేసిన సంఘటనలో నిందితుడు పోలీసులకు పట్టుబడ్డట్లు తెలుస్తోంది. హత్య జరిగిన నాటి నుంచి క్లూస్, ఇతర ఆధారాలతో డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ రాంచందర్‌రావు, మహాముత్తారం, కాటారం ఎస్సైలు మహేందర్‌యాదవ్, అభినవ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు పలు బృందాలుగా సాంకేతిక పరిజ్ఞానంతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు పలు జిల్లాల్లో తిరుగుతూ ఆంధ్రప్రాంతానికి వెళ్లగా ఎట్టకేలకు మంగళవారం తెల్లవారు జామున పోలీసులకు చిక్కినట్లు సమాచారం. నిందితుడి వద్ద డబ్బులు లేకపోవడంతో తాను డ్రైవర్‌గా పనిచేస్తున్న లారీ ఓనర్‌కు ఫోన్ చేయడంతో విషయం పోలీసులకు తెలిసింది. దీంతో ఆంధ్రప్రాంత పోలీసుల సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకునట్టు సమాచారం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నిందితుడు శనివారం ఆదివారంపేటలో రెక్కీ నిర్వహించి వృద్ధురాలిని పొట్టనబెట్టుకున్నట్లు తెలుస్తోంది. వృద్ధురాలితో సంబంధం ఉన్న ఓ మహిళతో కొన్నాళ్లుగా నిందితుడు సన్నిహితంగా ఉండేవాడని, ఇటీవల ఆ మహిళ దూరం పెట్టడంతో అతడు సైకోగా మారాడని తెలుస్తోంది. వృద్ధురాలు మల్లుబాయిని హత్య చేస్తే ఆస్తి దక్కి ఆ మహిళ ఇంప్రెస్ అవుతుందని హత్య చేశాడా.. ఆ మహిళపై కోపంతో వృద్ధురాలిని చంపాడా? ఆమహిళ ప్రోద్బలంతోనే ఈ హత్య జరిగిందా? అనే అనుమానాలు పలువురిలో వెల్లువెత్తుతున్నాయి.

సంతకాలు ఫోర్జరీ చేశారని ఫిర్యాదు

కేసముద్రం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) :ఫోర్జరీ సంతకాలు చేసి అక్రమంగా తమ సొసైటీలో 30 మంది భవానిగడ్డతండ శివశంకర్‌నగర్‌కు చెందిన వారు సభ్యత్వం పొందారని ఆరోపిస్తూ మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు కాట్రపల్లి మత్స్యపారిశ్రామిక సంఘం లిమిటెడ్ సభ్యుల తరఫున ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున మంగళవారం ఫిర్యాదు చేశారు. గతంలో ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం గ్రామానికి మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 2019లో ఒక బీఆర్ఎస్ నాయకుడు తమ సంఘం అధ్యక్ష పదవిని దక్కించుకోవడం కోసం కుట్రపన్ని నకిలీ తీర్మానం, 19 మంది సభ్యుల సంతకాల ఫోర్జరీతో భవానిగడ్డ, శివశంకర్‌నగర్‌కు చెందిన 30 మందికి సభ్యత్వం ఇప్పించారని తెలిపారు. తీర్మానం పుస్తకాలను పరిశీలించకుండా సభ్యత్వం ఇచ్చిన అధికారిపై చర్యలు తీసుకోవాలని, సభ్యులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎదురుబోయిన యాకయ్య, సురేష్, గడ్డం ఉప్పలయ్య, బాలకృష్ణ, శ్రీనివాస్, సోములు, ఐలయ్య, మల్లేషం, ప్రశాంత్ ఉన్నారు.

ప్రభుత్వం ఆదివాసీ ఎరుకలను గుర్తించాలి


సమావేశంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ ఎరుకల కులస్థులను గుర్తించి అన్నివిధాలుగా ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు అన్నారు. ములుగులో మంగళవారం జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నీడలేకుండా బతుకుతున్న ఎరుకల కులస్థులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అనంతరం ఎరుకల సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కేతిరి భిక్షపతి, ఉపాధ్యక్షులుగా పల్లకొండ భాస్కర్, మేడ బంగారయ్య, సల్ల బాబు, ప్రధాన కార్యదర్శిగా పల్లకొండ ఎల్లస్వామి, కోశాధికారిగా పాలకుర్తి సురేష్, సహాయ కార్యదర్శులుగా జంగాలపల్లి రాజు, దేవర్ల పరమేష్, కేతిరి అశోక్, దేవర్ల రాజు, సతీష్, పాలకుర్తి రాజులు ఎన్నికయ్యారు. మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా పాలకుర్తి ప్రమీల, ప్రధాన కార్యదర్శిగా కూరాకుల సరోజన, ఉపాధ్యక్షురాలిగా కూరాకుల సారమ్మ, జిల్లా సహాయ కార్యదర్శిగా పద్మ, కోశాధికారిగా సుల్తాన్ లావణ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఓని సదానందం, నాయకులు దుగ్యాల రాము, పులిచేరి సురేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, యూత్ కన్వీనర్ బిజిలి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

రెండు పడకగదుల ఇళ్ల పంపిణీ ఎప్పుడు?

- నిర్మాణం పూర్తయినా ప్రయోజనం శూన్యం
- 'డబుల్' ప్రస్తావన తీసుకురాని ప్రభుత్వం
- కొత్త గృహాల నిర్మాణానికే సర్కారు మొగ్గు

తొర్రూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సొంత ఇండ్లు లేని నిరుపేదలకు పక్కా ఇండ్లు నిర్మించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. బీఆర్ఎస్ పార్టీ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితి ఏమిటి అనేది సందిగ్ధంలో పడింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీకి నోచుకోలేదు. అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్ల నిర్మించిన ఇండ్లు వృధాగా పడి ఉన్నాయి. రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని ప్రకటించడంతో ఇప్పటికే నిర్మాణం పూర్తైన డబుల్ బెడ్‌రూం ఇండ్ల భవిష్యత్‌పై నీలి నీడలు అలుముకున్నాయి. ప్రభుత్వం ఇటీవల స్థలాలు ఉన్న వారికి నిబంధనల మేరకు ఇండ్లు నిర్మిస్తామని ప్రకటించడంతో గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌ల ప్రస్తావన తీయకపోవడంతో ఆ ఇండ్ల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారనుంది.



దుబ్బతండా సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ధ్వంసమవుతున్న అద్దాలు

-పూర్తయిన సర్వే

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహించింది. వాటిల్లో తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో 1250 మంది లబ్ధిదారులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని దుబ్బతండా వద్ద బహుళ అంతస్తుల విధానంలో 280 ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి సంవత్సరం దాటింది. సిబ్బంది చేపట్టిన సర్వే పరిశీలనలో 40శాతం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. మిగిలిన జాబితాలను నోటీసు బోర్డులపై ఉంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. దీంతో పాటు మండలంలోని గుర్తూరు, మాటేడు గ్రామాల్లో ఇండ్ల నిర్మాణం పూర్తైనప్పటికి కొందరు లబ్ధిదారులు అనధికారికంగా ఇండ్లలోకి చేరారు. చింతలపల్లి, అమ్మాపురం, ఖానాపురం, వెలికట్టె, వెంకటాపురం గ్రామాల్లో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఇండ్లు నిర్మించలేదు. ప్రభుత్వం ఇండ్లు నిర్మించినా లబ్ధిదారులకు అందించకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దరఖాస్తులు ఎక్కువగా ఉండటంతో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని గతంలో అధికారులు ప్రకటించినా నేటి వరకు ఇండ్లు పంపిణీ చేయలేదు. ప్రభుత్వం ఇటీవల కొన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో మోడల్ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నా తొర్రూరు మండల పరిధిలో అలాంటి నిర్మాణాలు ఏమీ చేపట్టలేదు. దీంతో పాలకుర్తి నియోజకవర్గంలో రెండు పడక గదుల ఇండ్లు మంజూరైతాయా, కావా అనే ఆలోచనలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని నియోజకవర్గాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇస్తున్నా ఇక్కడ మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అలాగే ఉంది.

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

మునిసిపాలిటీ పరిధిలోని దుబ్బతండా వద్ద నిర్మాణం పూర్తైన 280 ఇండ్లు పంపిణీ చేపట్టకపోవడంతో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మద్యం సేవించడం, జూదం ఆడడంలాంటివి చేస్తున్నారు. ఇండ్లకు బిగించిన కిటికీలు, తలుపులు చోరీకి గురవుతున్నాయి. కంప చెట్లు పెరిగి వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్గంధం వస్తుంది. కోట్ల రూపాయలతో నిర్మించిన ఇండ్లు పంపిణీకి ముందే శిథిలావస్థకు చేరుతున్నాయి. అధికారులు స్పందించి ఇండ్ల పంపిణీ చేపట్టాలని అర్హులైన లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ప్రభుత్వం నుండి ఆదేశాలు రాగానే ఇండ్ల పంపిణీ చేపడతామన్నారు.

దేశంలో రాజ్యమేలుతున్న భూస్వామ్య పెట్టుబడిదారి వ్యవస్థ

- న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వర్లు
- బయ్యారంలో 50 అడుగుల స్మారక స్థూపం ఆవిష్కరణ


బయ్యారంలో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు


కొత్తపేటలో ఏర్పాటు చేసిన స్మారక స్థూపం

బయ్యారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : దేశంలో భూస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థ రాజ్యమేలుతుందని.. అడుగడుగునా పీడిత ప్రజలు దోపిడీకి గురవుతున్నారని, వారి విముక్తి కోసం శ్రామికవర్గ పోరాటాలు నిర్మించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్డీ కేంద్ర కమిటీ సభ్యుడు, అనుబంధ ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముఖ్తార్‌పష స్మారకార్థం బయ్యారం మండలం కొత్తపేట గ్రామంలో నిర్మించిన 50 అడుగుల స్మారక స్థూపాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం బయ్యారంలోని కోదండ రామచంద్రస్వామి కల్యాణ మండపంలో జరిగిన స్మారక సభలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొని, ప్రసంగించారు. దేశంలో మతోన్మాద ఫాసిస్టు ప్రమాదం ముంచుకొస్తుందని శ్రామికవర్గంపై దాడులు అణచివేత పెరుగుతున్నాయన్నారు. తుదిశ్వాస వరకు శ్రామిక వర్గ పోరాటాలు నిర్మించిన ముఖ్తార్ పాష కోవిడ్ సమయంలో అకాల మరణం గావించడం కార్మిక లోకానికి తీరని లోటన్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలో పెంకు కార్మిక సంఘాన్ని స్థాపించి వారికి హక్కులు కల్పించాడని కొనియాడారు. దోపిడీ లేని సమాజాన్ని నిర్మించటమే పాషకు అర్పించే ఘనమైన నివాళి అన్నారు. సభలో ఇంకా ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, గోవర్ధన్, పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఇఫ్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనురాధ, జే.సీతారామయ్య తదితరులు ప్రసంగించారు. న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోటేశ్, సారంగపాణి, శ్రీధర్, ప్రసాద్, సత్యనారాయణ, సక్రు, సూర్యం, పుల్లన్న, పద్మ, మధు, వీరభద్రం, బిక్షం, వెంకన్న, నాగేశ్వరరావు, రాకేశ్ పాల్గొన్నారు. అంతకు ముందు అరుణోదయ సాంస్కృతి కళామండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రదర్శన చేపట్టారు.

రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా డీఎస్.రవిచంద్ర


రవిచంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన డీఎస్.రవిచంద్ర ఎన్నికయ్యారు. మహబూబాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మాజీ జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఓలం కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని అధ్యక్షుడు రవిచంద్ర తెలిపారు.

గారెపల్లి రిజర్వాయర్ మత్తడి పనుల అడ్డగింత


పనులు అడ్డుకుంటున్న భూనిర్వాసితులు

కాటారం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో చేపట్టిన గారెపల్లి నూతన రిజర్వాయర్ మత్తడి నిర్మాణ పనులను మంగళవారం పలువురు భూనిర్వాసితులు అడ్డుకున్నారు. మత్తడి నిర్మాణం కోసం సర్వే పనులు సాగిస్తుండగా తమకు పరిహారం ఇచ్చే వరకు పనులు చేయొద్దని అభ్యంతరం తెలిపారు. రిజర్వాయర్ కోసం 15 ఏళ్ల క్రితం భూములను తీసుకోగా కొందరికి నేటికీ పరిహారం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పరిహారం అందించకుండా పనులు సాగనిచ్చేదిలేదని భీష్మించుకున్నారు. ఇరిగేషన్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. కలెక్టర్‌తో కలిపించి హామీ ఇచ్చారు. పనులను అడ్డగించిన వారిలో గౌరోజు పెద్దరామన్న, అడువాల మొగిలి, ప్రభాకర్, సత్యం, సురేష్, మల్లయ్య, రాజయ్య, లక్ష్మి, మల్లక్క ఉన్నారు.

ఉపాధి పనుల్లో మాజీ సర్పంచ్


ఇనుగుర్తి లాలుతండాలో ఉపాధి పనులు చేస్తున్న తాజా మాజీ సర్పంచ్ రాంమూర్తి

ఇనుగుర్తి (మహబూ బాబాద్ జిల్లా), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అతిపెద్ద గ్రామ మైన ఇనుగుర్తి మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి మంగ ళవారం ఉపాధి హామీ పనులకు వెళ్లడం చర్చనీయాంశంగా మారి ంది. సర్పంచ్‌గా పనిచేసిన ఐదేళ్ల కాలంలో సుమారు రూ.20 లక్షల బిల్లులు తనకు బిల్లులు రావాల్సి ఉందని, అప్పులు తీసుకువచ్చి గ్రామాభివృద్ధి కోసం పెట్టుబడి పెట్టానని, ఇంటి నిర్వహణ కోసం తప్పనిసరి పరిస్థితిలో ఉపాధి పనులకు వెళ్లాల్సి వస్తోం దని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇంటర్ వరకు చదివి తెలుగు రచనా నైపుణ్యంతో డెస్క్ జర్నలిస్టుగా శిక్షణ కూడా పొందిన ఆయన ఇలా అన్‌స్కిల్డ్ పనికి వెళ్లడం విద్యావంతులను ఆలోచింపజేస్తోంది.

మంత్రివర్గాన్ని విస్తరిస్తే ప్రభుత్వం పడిపోతుంది..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మంత్రివర్గాన్ని సీఎం రేవంత్‌రెడ్డి విస్తరిస్తే ప్రభుత్వం పడిపోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జోస్యం చెప్పారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఎర్రబెల్లి ఆవిష్కరించి మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అంటూ మోసపూరిత హామీలతో ఊదరగొట్టి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అధిక స్థానాలు బీఆర్ఎస్ గెలుస్తదన్న భయంతో నిర్వహించడం లేదన్నారు. మహిళలకు తులం బంగారం, రూ.2,500 ఆశ చూపి కనీసం కల్యాణలక్ష్మి పథకం కూడా పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదన్నారు. రైతుబంధు ఎగ్గొట్టి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాటు పడి నిత్యం సాగునీరు, విద్యుత్ అందజేసినట్లు తెలిపారు. మండల వ్యవస్థను ఎన్టీఆర్ తీసుకు వస్తే తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఇప్పటికప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సర్వేలన్నీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానే ఉన్నట్లు తెలి పారు. ఏప్రిల్ 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి 10 వేల మందిని తరలించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సీతారాములు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మంగళపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిన్న అంజయ్య, బిందు శ్రీనివాస్, హనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, ప్రమోద్ కుమార్, గాంధీనాయక్, కుర్ర శ్రీనివాస్, కాలు నాయక్, అంకూస్, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీతి అయోగ్‌లో గంగారం ప్రథమ స్థానం

మానుకోట కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

గంగారం, ఏప్రిల్ 15 (అంధజ్యోతి) : వెనుకబడిన మండలాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్రప్రభుత్వం నీతి అయోగ్‌లో ఎంపిక చేసిన గంగారం మండలానికి ప్రగతిలో ప్రథమ స్థానం దక్కిందని మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం డెల్టా ర్యాంకింగ్‌లో తెలంగాణ రాష్ట్రం మహబూ బాబాద్ జిల్లా నుంచి గంగారం ఎంపిక కావటం పట్ల రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క మండల అధి కారులను అభినందించారు. సామాజిక ఫలితాలు అభివృద్ధిని పెంపొందించటంలో జిల్లా అధికారులతో సమన్వయమైన మండలంలోని శాఖల అధికారులు కలిసి పనిచేయటంతోనే ఈ ర్యాంకు సాధ్యమైందన్నారు.

కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు


కాలసర్ప దోష నివారణ పూజలు చేస్తున్న భక్తులు

మహదేవపూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కాలసర్ప దోష నివారణ పూజలను నిర్వహించారు. ఉదయం నుంచే గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి కాలసర్ప దోష పూజలతో పాటు నవగ్రహ పూజలు నిర్వహించారు. ఆలయానికి ఒక్కరోజులోనే రూ. లక్షా 80వేల ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 4 గంటల నుంచే భక్తులు క్యూ లైన్‌లో నిలబడి పూజలు చేశారు. దోష నివారణ పూజలతో పాటు అభిషేకాలు, కుంకుమ పూజలు, లడ్డూ ప్రసాదం కొనుగోలు చేశారని అధికారులు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో భక్తులకు పంది ళ్లు వేసి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈవో మహేష్ పేర్కొన్నారు.

మాజీ మంత్రి చందూలాల్‌కు ఘన నివాళి

గోవిందరావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని నాయకులు మంగళవారం నివాళులు అర్పించారు. చందూలాల్ చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చందూలాల్ ములుగు జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా, ట్రైకార్ చైర్మన్‌గా ఎన్నో సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజ్మీరా సురేష్, ఊట్ల మోహన్, రష్మిహనుమం, మల్లేష్, తాటికొండ శ్రీనివాస్, చుక్క గట్టయ్య, గాంధర్ల సాంబయ్య, బత్తుల రాణి, కృష్ణారావు, బండి రాజశేఖర్, తిరుపతి, కృష్ణారెడ్డి, మానునాయక్, బాలాజీ, కొండె రమేష్, ఇంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, లక్ష్మయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.


గోవిందరావుపేటలో చందూలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

వెంకటాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని పలు గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ యువజన సంఘం పేరుతో మంగళవారం పోస్టర్లు వెలిశాయి. అడవుల్లో విచ్చలవిడిగా బాంబులు పెట్టడం సరికాదని అందులో పేర్కొన్నారు. 'ఆదివాసీలను చంపడం మీ సిద్ధాంతమా, అడవుల్లో బాంబులు, ఆదివాసీల గుండెల్లో గుబులు.. మావోయిస్టుల్లారా సిగ్గుసిగ్గు' అని ఆదివాసీ యువజన సంఘం పేరుతో పోస్టర్లను అంటించారు.

అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్


మాక్ డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కృష్ణకాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అగ్నిమాపక సిబ్బంది మంగళవారం మాక్‌డ్రిల్‌ను చేపట్టారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా విన్యాసాలతో వివరించారు. అప్రమత్తత ఉంటే ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు కూడా కాస్త తెలివిగా వ్యవహరిస్తే ఎలాంటి ప్రమాదం వాటిల్లదని సూచించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మన్ జి. సుజిత్ కుమార్, జి. సుధాకర్, ఎం. సురేష్, ఏ. ప్రతాప్, సిహెచ్. ప్రశాంత్, బి. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

తనయుడికి తలకొరివి పెట్టిన తల్లి


ఒట్టిపాక శివ (ఫైల్)

గార్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ జిల్లా గార్ల సమీపంలో గండి చెరువు వద్ద సోమవారం కారు రెండు చెట్లకు బలంగా ఢీకొట్టి లోయలోకి పల్టీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్ర గాయాలపాలపాలైన విషయం తెలిసిందే. వీరిని 108 సహాయంతో వెంటనే మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇందులో గార్లకు చెందిన ఒట్టిపాక శివ (28)కు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 12గంటల సమయంలో మృతి చెందాడు. శివ మృతి వార్త తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు తండ్రి ఒట్టిపాక కిరణ్ ఫిర్యాదు మేరకు ఎస్సై రియాజ్ పాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా శివకు పెళ్లి కాకపోవడంతో తల్లి తనయుడికి తలకొరివి పెట్టింది. చేతికందిన కొడుకు చనిపోవడంతో ఆ తల్లి విలవిలా ఏడుస్తుంటే గ్రామంలో ప్రతీ ఒక్కరు కన్నీరు పెట్టారు.



హనుమకొండ గోపాల్‌పూర్ శివారులో పశువులను మేపేందుకు వచ్చిన మహిళ గొడుగును ఆశ్రయించిన దృశ్యం

భానుడి భగభగ

రోజురోజుకు పెరుగుతున్న ఎండతీవ్రత

- 42డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- మహబూబాబాద్ జిల్లాలో అత్యధికం
- ఉక్కపోతతో జనం విలవిల
- ఉమ్మడి జిల్లాలో వడదెబ్బతో ముగ్గురి మృతి

హనుమకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భానుడు భగభగ మంటున్నాడు. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మంగళవారం గరిష్ఠంగా 42.2డిగ్రీలు, కనిష్ఠంగా 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. జనం వడగాలులు, ఉక్కపోతకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వడదెబ్బ మరణాలు మొదలయ్యాయి. మంగళవారం ఒక్క రోజే ముగ్గురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు కాగా మరొకరు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన వారు. మహబూబాబాద్ జిల్లాలోని గార్ల మండలం గుడితండాలో వ్యవసాయ కూలీకి వెళ్లిన బాదంపూడి సుశీల (57), కొత్తగూడ మండలం వేలుబెల్లి గ్రామంలో బాసాని మల్లమ్మ (65) వడదెబ్బకు గురై మృతి చెందారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వర దేవాలయం వద్ద వృద్ధురాలు కాంపెల్లి కనకమ్మ (70) వడదెబ్బకు గురై చనిపోయింది. అలాగే ఉమ్మడి జిల్లాలో కొందరు వడదెబ్బకు గురై ఆస్పత్రుల పాలైనట్లు తెలుస్తోంది. వడదెబ్బతో అస్వస్థతకు లోనైవారికి తక్షణం వైద్యసహాయం అందించేందుకు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైతే ప్రత్యేకంగా పడకలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. వడదెబ్బ బాధితుల కోసం అన్ని పీహెచ్‌సీల్లో ఆర్‌ఎస్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు.

ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 42డిగ్రీలు దాటింది. మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో జిల్లాలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో 41.7డిగ్రీలు, జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కూనూరులో 41.3 డిగ్రీలు, వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గొర్రెకుంటలో 41.22 డిగ్రీలు, హనుమకొండ జిల్లా కాజీపేటలో 40.8 డిగ్రీలు, ములుగు జిల్లా మల్లంపల్లిలో 40.8 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఉదయం 9 గంటలకే ఎండ సుర్రుమంటుండగా మధ్యాహ్నం రోడ్లపైకి వచ్చేందుకు జనం జంకుతున్నారు. దీంతో చిరువ్యాపారాలు తగ్గిపోయాయి. ప్రజలు కూడా ఎండవేడిమి నుంచి ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. అలాగే శీతల పానీయాలు, కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది.



ఎండదెబ్బ నుంచి రక్షణకు ఇలా..

ఎండదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు ప్రతీ ఒక్కరు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. తలనొప్పి, కండరాలు పట్టేయడం, వికారం, కళ్లుతిరగడం, వాంతులు చేసుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బ తగిలినట్టుగా గుర్తించి వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచిస్తున్నారు. ప్రాథమిక చికిత్సలో భాగంగా నీటిలో ఓఆర్ఎస్ పొడిని కలిపి తాగాలని సలహా ఇస్తున్నారు. వీలైనంత మేరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో ఎక్కువ సమయం తిరగకుండా, ఇళ్లు, లేదా చల్లని గాలివీచే ప్రాంతాల్లో సేదతీరితే మంచిందని చెబుతున్నారు. ప్రతీ ఒక్కరు 5 నుంచి 6లీటర్ల వరకు నీటిని తాగాలని, చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయొద్దని, తప్పనిసరి పరిస్థితులో వెళ్లాల్సివస్తే గొడుగు, వస్త్రాలను కప్పుకోవాలని సూచిస్తున్నారు. ఎవరైనా వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళితే ఆ వ్యక్తికి నీరు తాగించకుండా వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలించాలని, వడదెబ్బ నుంచి కోలుకునే వరకు వైద్యుల సలహా మేరకు నడుచుకోవాలని సూచిస్తున్నారు.

ముక్తీశ్వరుడి దర్శనానికి వచ్చి..

వడదెబ్బతో కాళేశ్వరాలయంలో వృద్ధుడి మృతి



కనకయ్య (ఫైల్)

మహదేవపూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ముక్తీశ్వరుడి దర్శనానికి వచ్చిన ఓ వృద్ధుడు వడదెబ్బతో మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆలయంలో మంగళవారం జరిగింది. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన కాంపెల్లి కనకయ్య(72), అతడి భార్య, భూమక్క, కొడుకు శ్రీనివాస్ మంగళవారం ఉదయం కాళేశ్వరానికి వచ్చారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. కనకయ్య కుమారుడు శ్రీనివాస్, భార్య భూమక్క రాహు కేతు పూజల కోసం ఆలయంలోకి వెళ్లగా అతడు మాత్రం పక్కనే ఉన్న హోటల్‌కు వెళ్లాడు. టీ తాగుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. హోటల్ నిర్వాహకులు కుటుంబసభ్యులకు సమాచారం అందించగా పూజలు మధ్యలోనే వదిలేసి వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న కనకయ్యను మహదేవపూర్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దాంతో కుటుంబసభ్యులు అతడి మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు.

ఆలయంలో సంప్రోక్షణ

పూజలు చేస్తుండగా వృద్ధుడు చనిపోవడంతో వెంటనే అర్చకులు ఆలయాన్ని మూసి శుద్ధి చేశారు. సంప్రోక్షణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు.

మానుకోట జిల్లాలో ఇద్దరు మహిళల మృతి



బాదంపుడి సుశీల, బాసాని మల్లమ్మ (ఫైల్)

గార్ల/కొత్తగూడ, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని వేర్వేరు మండలాల్లో వడదెబ్బకు గురై మంగళవారం ఇద్దరు మృతి చెందారు. గార్ల మండలం గండితండాలో గార్లకు చెందిన వ్యవసాయ కూలీ బాదంపుడి సుశీల (57) మృతి చెందారు. గార్లకు చెందిన సుశీల వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మంగళవారం ఉదయం మిర్చితోట ఏరేందుకు గండితండాకు వెళ్లగా.. మధ్యాహ్నం సమయంలో కూలీలందరితో కలిసి భోజనం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వడదెబ్బకు గురై అస్వస్థతతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలాగే కొత్తగూడ మండలం వేలుబెల్లిలో వడదెబ్బతో వృద్ధురాలు బాసాని మల్లమ్మ (65) మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇంటివద్దనే ఉంటున్న మల్లమ్మ ఎండల తీవ్రతకు వడదెబ్బకు గురై తీవ్ర అస్వస్థతతో మృతి చెందింది. మల్లమ్మకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు.

అనుబంధాలు కలిసొచ్చేనా?

5వ పేజీ తరువాయి

టీఎంయూలోని ఒక వర్గం బీఆర్ఎస్‌తో అను బంధాన్ని తెంపుకుని కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. ఇలా కార్మిక సంఘాల్లో కీలకమైన ఆర్టీసీ, విద్యుత్, సింగరేణిలో బీఆర్ఎస్‌కు అనుబంధ సంఘాలు ఒక్కొక్కటిగా దూరమవుతు వస్తున్నాయి.

ఆ వర్గాలపై ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభావం..

బీఆర్ఎస్‌కు బలం, బలగం యువతనే. ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించారు. అయితే గత వరుస ఎన్నికల్లో యువత గులాబీ పార్టీకి దూరమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. 2014 జూలైలో జరిగిన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ ఓటమి క్యాడర్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఈ స్థానం నుంచి మూడు పర్యాయాలు బీఆర్ఎస్ గెలిచింది. అప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో నిరాశలో ఉన్న గులాబీ శ్రేణులకు, ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓటమితో మరింత డీలా పడ్డారు. తాజాగా జరిగిన వరంగల్, ఖమ్మం, నల్లగొండతో పాటు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పోటీకి దిగకపోవటం, కనీసం ఏ అభ్యర్థికో మద్దతు ఇవ్వకపోవటంతో బీఆర్ఎస్‌తో అనుబంధంగా కొనసాగిన ఉపాధ్యాయులు తమదారి తాము చూసుకున్నారనే చర్చ జరుగుతోంది.

'అనుబంధాల'తో చర్చలేవీ?

పార్టీ రజతోత్సవాల వేళ ఊరూరా గులాబీ పండుగను ఘనంగా జరుపుకొంటామని పార్టీ నేతలు ప్రకటిస్తున్నారు. అయితే ఇప్పటికే పార్టీకి దూరమైన సింగరేణి, విద్యుత్, ఆర్టీసీ కార్మిక సంఘాలను దగ్గరికి తీసుకునేందుకు ప్రణాళిక లేకపోవడంపై పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో భూపాలపల్లి, పరకాల, ములుగు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు మంథని పరిధిలోని కాటారం రెవెన్యూ డివిజన్ పరిధిలో సింగరేణి కార్మిక కుటుంబాలు ఉన్నాయి. అలాగే భూపాలపల్లి కేటీపీపీతో పాటు ఎన్‌పీడీసీఎల్ పరిధిలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్టీసీలో వేలాది మంది కార్మికులున్నారు. రజతోత్సవాల వేళ ఈ కార్మిక లోకాన్ని కదిలించే ప్రయత్నం జరగటం లేదనే టాక్ వినబడుతుంది. అంతేకాకుండా పార్టీ యువజన విభాగాన్ని క్రియాశీలకం చేయాలనే చర్చ జరుగుతోంది. జిల్లా, నియోజక వర్గ కేంద్రాల్లోనే సమీక్షలు, సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారని, దూరమైన వర్గాలను దగ్గరికి చేర్చే కార్యాచరణ ఏదనే చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. అయితే భారీ బహిరంగ సభను నిర్వహించి కేడర్‌లో ఉత్సాహాన్ని నింపేందుకు కసరత్తు చేస్తున్న పార్టీ.. ఉద్యమానికి బలమైన పునాదులుగా నిలిచిన కార్మిక సంఘాలను, ఇతర వర్గాలను తిరిగి గులాబీ గూటికి చేర్చే ప్రయత్నాలు జరగటం లేదని చర్చ జరుగుతుంది.



వెంకటాపూర్ తహసీల్దార్ కార్యాలయం

భూ భారతిపై ఎన్నెన్నో ఆశలు

5వ పేజీ తరువాయి

పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి పత్రాలను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. కొత్త సాఫ్ట్‌వేర్ సామర్థ్యాన్ని గుర్తించడానికి కొత్త పోర్టల్‌లో ఏమైనా కార్యాచరణ సమస్యలు ఉన్నాయో చూడడానికి పైలట్ ప్రాజెక్టుగా మండలంలో అమలు పరచనున్నారు. మూడు నెలలపాటు మండలంలో ఈ చట్టాన్ని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆతర్వాత ఫలితాలను బట్టి పూర్తిస్థాయిలో పనిచేస్తుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

నేడు షెడ్యూల్ విడుదల చేయనున్న కలెక్టర్

భూభారతికి వెంకటాపూర్ మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికవగా.. గ్రామాలవారీగా రెవెన్యూ సదస్సును నిర్వహించేందుకు కలెక్టర్ టీఎస్.దివాకర కార్యాచరణ రూపొందిస్తున్నారు. బుధవారం ఆయన షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. గురువారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు సదస్సులను నిర్వహించి రైతుల నుంచి స్వీకరించే వినతులను పరిశీలించి వచ్చే నెల 31లోపు వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటారు. మే 31లోగా ప్రతి సమస్యకూ పరిష్కారం చూపి రికార్డులను సరిచేయడం ద్వారా జూన్ 2న రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించారు. గతంలో వెంకటాపూర్ మండలం నుంచి వచ్చిన సాదాబైనామా దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు.

రేపటి నుంచి గ్రామాలకు రెవెన్యూ బృందాలు

గురువారం నుంచి రెవెన్యూ బృందాలు గ్రామాల్లో సందర్శిస్తాయి. భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిన అనంతరం పైలట్ ప్రాజెక్టుగా మొదటిసారి ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలాన్ని ఎంపిక చేశారు. మండలంలోని భూనిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బందికి ప్రతి ఒక్కరూ భూములకు సంబంధించిన దస్తావేజులు, డాక్యుమెంట్లు చూపాల్సి ఉంటుంది. వాటిని అందుబాటులో ఉంచుకోవాలి. గురువారం నుంచి జరిగే ఈ ప్రక్రియలో ప్రజల నుంచి స్వీకరించిన విజ్ఞప్తులపై సదస్సులు నిర్వహించి, భూభారతి చట్టాన్ని అమలు చేస్తాం.

\- టీఎస్. దివాకర, ములుగు కలెక్టర్

కేయూలో 75 వసంతాల సందడి

- 22 ఏళ్ల తర్వాత వర్సిటీలో క్రీడా సంబురాలు
- హాజరుకానున్న మిట్టపెల్లి సురేందర్, కబడ్డీ కోచ్ శ్రీనివాసరెడ్డి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 75 వసంతాల వేళ క్రీడా సంబురాల సందడి కనిపిస్తోంది. 1976 ఆగస్టు 19న ఏర్పడిన కాకతీయ యూనివర్సిటీ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదిగింది. తొలుత ఉస్మానియా వర్సిటీ పోస్టు గ్రాడ్యుయేషన్ సెంటర్‌గా ఉండగా.. తర్వాత ఉత్తర తెలంగాణ ప్రాంత విద్య అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ వర్సిటీకి పునాది వేయగా.. యూజీ, పీజీ కోర్సులతో పాటు ప్రొఫెషనల్ కోర్సులు, పీహెచ్‌డీ, ఇంజనీరింగ్, ఇంటిగ్రేటెడ్ కోర్సులతో ఏటేటా వెయ్యిమంది విద్యార్థులను అక్కున చేర్చుకుంటోంది. కాకతీయరాజుల పేరుతో కాకతీయ యూనివర్సిటీని స్థాపించడంతో పాటు కాకతీయుల విద్యా మంత్రి, సంస్కృత పండితుడు విద్యారణ్యుడి పేరు మీదుగా వర్సిటీ ప్రాంతానికి విద్యారణ్యపురిగా నామకరణం చేశారు. 672 ఎకరాల విస్తీర్ణంలో 29డిపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రధానంగా ఆర్ట్స్ లైఫ్‌సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్ ఎడ్యుకేషన్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులున్నాయి. కేయూకు 19 అనుబంధ కళాశాలలు మరో 473 అఫిలియేటెడ్ కళాశాలలున్నాయి. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉంది.

క్యాంపస్ స్టూడెంట్లకు తీపి గుర్తు

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో పీజీ కోర్సుల్లో రెండేళ్లపాటు, ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ఐదేళ్లపాటు విద్యార్థులు విద్యనభ్యసిస్తారు. రెండేళ్ల తీపి గుర్తుల్లో కళాశాల వార్షికోత్సవం, క్రీడోత్సవంతో పాటు సాంస్కృతిక సంబురాలలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తారు. క్రీడల్లో జట్టుగా విజయం సాధిస్తే విద్యార్థి జీవితంలో మురుపురాని జ్ఞాపకంగా నిలిచిపోతోంది.



కేయూ ఆడిటోరియం



అధ్యాపకులతో కమిటీల ఏర్పాటు

ఈ ఏడాది 75వసంతాలు కావడంతో వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. గ్రూపు సాంగ్‌లు, కల్చరల్ ఈవెంట్లను సెనెట్ హాల్‌లో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

22 ఏళ్ల తర్వాత వార్షికోత్సవ సంబురాలు

కాకతీయ యూనివర్సిటీలో అనివార్య పరిస్థితుల వల్ల ఏటేటా నిర్వహించాల్సిన వార్షికోత్సవ సంబురాలు, క్రీడా దినోత్సవాలు నిర్వహించలేదు. అయితే కేయూ వీసీగా ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని విద్యార్థులకు కోరిక మేరకు ఈ ఏడాది 75వ వార్షిక సంబురాలను నిర్వహిస్తున్నారు. 22 ఏళ్ల తర్వాత వర్సిటీ క్యాంపస్ కళాశాలలో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కేయూ క్రీడా మైదానంలో వర్సిటీనిలోని 29 విభాగాలకు చెందిన మొదటి, రెండో ఏడాది విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి క్రీడాపోటీలను నిర్వహించారు. అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు హోరాహోరీగా క్రీడల్లో పాల్గొని తమ సత్తా చాటారు. బహుమతులను గెలుచుకున్నారు. క్రీడాపోటీలను కేయూ వ్యాయామ విద్యా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శేషాల కుమార్ నేతృత్వంలో నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటారు.



క్యాంపస్ కళాశాల బోర్డు

రేపు ఆడిటోరియంలో సంబురాలు

కాకతీయ యూనివర్సిటీ 75వ వార్షికోత్సవ వేళ.. క్రీడోత్సవ, సాంస్కృతిక సంబురాలకు కేయూ ఆడిటోరియాన్ని వేదికగా చేశారు. 17న గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం ఉంటుంది. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రముఖ కవి, తెలంగాణ వాగ్గేయకారుడు మిట్టపల్లి సురేందర్, ఇండియన్ కబడ్డీ జట్టు కోచ్ లింగపల్లి శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేస్తారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తారు. కేయూ ప్రొఫెసర్లు వెంకటయ్య, ఫిజికల్ డైరెక్టర్ శేషాల కుమారస్వామి, ముంజం శ్రీనివాస్‌లతోపాటు క్యాంపస్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్, వార్షికోత్సవాల కో కన్వీనర్ మమత కార్యక్రమాలకు నేతృత్వం వహిస్తున్నారు.

కూల్‌కూల్.. కూలర్స్



నగరంలోని ఓ షాపులో విక్రయించేందుకు అందుబాటులో ఉన్న కూలర్లు

- సామాన్యులకు అందుబాటులో రకరకాల కూలర్లు
- జోరందుకున్న విక్రయాలు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భానుడు భగభగల నుంచి ఉపశమనం కోసం సామాన్య ప్రజలు కూలర్లను కొనుగోలు చేసేందుకు షాపులకు పరుగు పెడుతున్నారు. తమ బడ్జెట్‌లో వచ్చే కూలర్లను కొనేందుకు ఆసక్తి చూపుతుండటంతో వ్యాపారులు కూడా వివిధ మోడళ్లలో అందుబాటులోకి తెచ్చారు. పేద, మధ్యతరగతి వారి ఇళ్లకు, గదులకు అనుగుణంగా వివిధ సైజుల్లో కూలర్లు లభ్యమవుతున్నాయి. ఇక కొందరేమో పాతకూలర్లకు మరమ్మతులు చేయించుకుంటున్నారు. అలా వేసవికాలాన్ని కూల్‌కూల్‌గా కుటుంబ సభ్యులతో గడిపేందుకు ప్రజలు తాపత్రయపడుతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం సైజును బట్టి రూ.3వేల నుంచి రూ. 9వేల వరకు ధరల్లో కూలర్లు లభిస్తున్నాయి.

ధర ఆధారంగా కూలర్లకు 1, 2 ఏళ్ల గ్యారంటీ, వారంటీ ఇస్తున్నామని నగరంలోని పలువురు కూలర్ల షాపు యజమానులు చెపుతున్నారు. అయితే వేసవి ప్రారంభం నాటికి ఇప్పటికి కూలర్ల ధరలు భారీగా పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు. పలు ప్రముఖ కంపెనీలు కూడా బ్రాండెడ్ పేర్లతో కూలర్లను అందుబాటులోకి తేగా.. అసెంబుల్డ్ కూలర్లు కూడా బాగానే అమ్ముడవుతున్నాయి. ఇవి ప్లాస్టిక్, ఐరన్ బాడీలతో పలు పేర్లతో లభ్యమవుతున్నాయి.

ఎండలతో పాటే గిరాకీ పెరిగింది..



వేసవికాలం ప్రారంభం నుంచే ఎండలతో పాటు కూలర్ల అమ్మకాలకు గిరాకీ పెరిగింది. ఈ ఏడు నగర వాసులతో పాటు వివిధ మండల కేంద్రాల నుంచి కూలర్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు కూలర్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. సామాన్యుడికి అందుబాటు ధరల్లో కొత్త కొత్త మోడళ్లు.. అల్యూమినియం, ప్లాస్టిక్ బాడీలతో అందిస్తున్నాం. ఈ ఏడు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో గతం కన్నా ఇంకా ఎక్కువ కూలర్లను విక్రయించే అవకాశం ఉంది.

\- వర్ణ గోపాల్‌రెడ్డి, కూలర్లషాపు యజమాని, హనుమకొండ చౌరస్తా

గంటలో 1,046 వీడియోలు అప్‌లోడ్

గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సంగీత ప్రదర్శనకు సంబంధించిన 1,046 వీడియోలను గంట వ్యవధిలో యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన ఓ ఔత్సాహికుడు గిన్నిస్ బుక్ రికార్డును సాధించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) యు.సుభాష్‌చంద్రబోస్ సంగీత కళాకారుడు కూడా.



గిన్నిస్ బుక్ మెడల్ అందుకుంటున్న సుభాష్‌చంద్రబోస్

గతేడాది డిసెంబరులో జరిగిన ప్రపంచ స్థాయి మ్యూజిక్ ప్రదర్శనలో కీబోర్డు వాయిస్తున్న సంగీత కళాకారుల బృందం సరళి స్వరాల్ 1,046 వీడియోలను గంటల వ్యవధిలోనే అప్‌లోడ్ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును సాధించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల చేతుల మీదుగా సుభాష్‌చంద్రబోస్ మెడల్‌తోపాటు సర్టిఫికెట్‌ను సొంతం చేసుకున్నారు. సంగీతంలో కీబోర్డు ద్వారా హల్లెల్ మ్యూజిక్ స్కూలు బృందంతో డైరెక్టర్ అగస్టిన్ ప్రోత్సాహంతో ఈ రికార్డు సాధించినట్లు సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

మే 14న మిస్ వరల్డ్ టీం రాక

- రామప్పలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- అధికారులతో కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్పను సందర్శించడానికి మిస్ వరల్డ్ టీం మే 14న రాబోతుందని, ఇందుకు వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయం ఆవరణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్లు సి.హెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావుతో సమావేశమై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ మే 14న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొననున్న పలు దేశాలకు చెందిన పోటీ మహిళలు జిల్లాలోని పర్యాటక ప్రాంతమైన, యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్పను సందర్శించనున్నారని అన్నారు. ఈనేపథ్యంలో నేషనల్ హైవేలోని రోడ్డు పనులను మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి జంగాలపల్లి వరకు, జంగాలపల్లి నుంచి రామప్ప దేవాలయం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు, రామప్ప దేవాలయం నుంచి హరిత హోటల్ వరకు పంచాయతీరాజ్ రోడ్డు, ఇంజనీరింగ్ అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి రోడ్ల మరమ్మతు పనులను ఈనెల 30వతేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పాలంపేటలోని రామప్ప దేవాలయం స్వాగత ఆర్చ్‌కు రంగులు వేసి సుందరీకరించాలని, ఈపర్యటనకు సంబంధించి అధికారులతో వాట్సాప్ గ్రూప్ తయారు చేయాలని టూరిజం అధికారులకు సూచించారు. సంబంధితశాఖల అధికారులు ఈ పర్యటనకు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని, త్వరలో ఫీల్డ్ విజిట్ చేస్తానని సూచించారు. ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకట్టుకునేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో ఈ పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ప్రొఫెసర్ పాండురంగారావు, డీఎస్పీ రవీందర్, పురావస్తుశాఖ అధికారులు, జిల్లా అధికారులు, వెంకటాపూర్ మండల అధికారులు పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లా జడ్జిగా రమేష్ బాబు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి సీహెచ్ రమేష్‌బాబు బదిలీ అయ్యారు. ఆయనను భూపాలపల్లి జిల్లా జడ్జిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చే సింది. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జిగా వి ధులు నిర్వర్తిస్తున్న కె.పట్టాభిరామారావును నియమించారు. భూపాలపల్లి జిల్లా జడ్జిగా పనిచేస్తున్న వి.నారాయణ బాబును వరంగల్ జిల్లా కో ఆపరేటివ్ ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎలుగుబంటి కళేబరానికి పోస్టుమార్టం

మహాముత్తారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి యత్నారం గ్రామ సమీపంలోని కొండెంగలవాగు వద్ద సోమవారం ఎలుగుబంటి కళేబ రం లభ్యమైన విషయం విదితమే. మంగళవారం ఫారెస్టు అధికారులు స్థానిక ప్రభుత్వ పశువైద్యుడు భరత్‌బాబుతో పోస్టుమార్టం నిర్వహించారు. కళేబరం నుంచి శాంపిళ్లను సేకరించారు. ఎలుగుబంటి ఎలా మృతి చెందిందనే విషయం ఇప్పుడే వెల్లడి కాదని, శాంపిళ్లను ల్యాబ్‌కు పంపిస్తామని, రిపోర్టు వచ్చిన అనం తరం కారణాలు తెలుస్తాయని వైద్యుడు తెలిపారు. ఇదిలా ఉండగా ఎలుగుబంటి మృతి నేపథ్యంలో ఇద్దరు అనుమానితులను అ దుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు పెగడపల్లి రేంజర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

‘భూ భారతి’ అమలుపై హర్షం





వెంకటాపూర్, మల్లంపల్లిలో సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వెంకటాపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్టులో భాగంగా భూ భారతి చట్టంలో వెంకటాపూర్ మండలాన్ని ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తమైంది. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ధనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రప టాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ ధరణి చట్టం కారణంగా పేదలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, వందల ఎకరాల భూకబ్జాలు, దందాలు చేస్తూ అమాయక ప్రజలను మోసం చేసిన చరిత్రను బీఆర్ఎస్ మూటకట్టుకుందని విమర్శించారు.. పేదల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించిందన్నారు. దీంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, నాయకులు బండి శ్రీనివాస్, వేముల చంద్రాకర్‌రెడ్డి, మిల్కూరి ఐలయ్య, దొంతరవేని కుమార్, మారం సుమన్‌రెడ్డి, మామిడిశెట్టి కోటి, కట్టికోళ్ల వెంకటేశ్, కాసిడి శ్రీనివాసరెడ్డి, మూడ్ వీరేష్, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మల్లంపల్లి మండలంలో..

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టు కింద భూభారతి పోర్టల్‌ను ప్రారంభించడాన్ని పురస్కరించుకుని మల్లంపల్లి మండలంలోని కొడిశలకుంట, గుర్తూరుతండా, ముద్దునూరుతండాల్లో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు ధనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా జరిగిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో రాజేందర్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. గాంధీజీ, అంబేద్కర్‌ల విధానాలతో దేశాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. రైతుల పాలిట శాపంగా మారిన ధరణి పోర్టల్‌ను రద్దుచేసి అంబేద్కర్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద భూభారతి పోర్టల్‌ను ప్రారంభించడం శుభసూచికమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బానోత్ మోహన్, యాకూబ్, సురేష్, మార్క విజేందర్, బానోత్ రాజు, బాలాజీ, ధరావత్ శ్రీకాంత్, నరసింహ, అమర్‌సింగ్, రాము, రాజు, సంతోష్, తుల్యా, బాబుసింగ్, వాగ్యా, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

మహాముత్తారం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుగుపల్లి అంగన్ వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. తల్లి పాలన విశిష్టత, పౌష్టికాహారం గురించి వారి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీలు ప్రమీలా, లక్ష్మి, గ్రామ కార్యదర్శి పాగే లక్ష్మి, ఏఎన్ఎం విజయ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మహదేవపూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని యాంటీడ్రగ్ కో ర్డినేటర్ వేముల రమేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంపై పోస్టర్ మేకింగ్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్. అధ్యాపకులు శ్రీనివాస్, పోరిక రాజు, ఈ.మాధవి, శాఖమూరి రవీందర్, టి.రజిత, జి.రమేష్, సీహెచ్.రాజేందర్, కె.మున్నయ్య, వంగపల్లి పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని రాంనగర్‌తండా శివారులో గుడుంబా స్థావరాలపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో గ్రామశివారులో దాడులు నిర్వహించామని, 400 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న అజ్మీరా దశరథ్, లావుడ్యా వినోద్‌కుమార్, లావుడ్యా భగవాన్‌సింగ్, అజ్మీరా సునీల్, పాల్తియా తిరుపతిలపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఎవరైనా గుడుంబా తయారుచేసినా, విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో రెండో ఎస్సై లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూమాత రైతు సంక్షేమ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడిగా బండారి ప్రశాంత్ నియామకం అయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్యయాదవ్ మంగళవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటూ సహాయ, సహకారాలు అందిస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రశాంత్ పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలు అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ములుగు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.కుమారస్వామి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని రెండోరోజు మంగళవారం ములుగులోని 163వ జాతీయ రహదారిపై సిబ్బంది నీటితో వివిధ రకాల విన్యాసాలు ప్రదర్శించారు. ఈసందర్భంగా ఫైర్ ఆఫీసర్ కుమారస్వామి మాట్లాడుతూ అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల సహకారం ఉంటే అగ్నిప్రమాదాలను ముందుగా గుర్తించి నివారించవచ్చని అన్నారు. అనంతరం బస్టాండ్, ప్రధాన కూడళ్లలో పోస్టర్లు అంటించడంతోపాటు ప్రజలు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ పి.మహేశ్వర్, డీవోపీ పి.సురేందర్, ఫైర్‌మెన్‌లు ఎం.మహేందర్, బి.రాజు, సీహెచ్.ప్రవీణ్, పి.సాయికుమార్, హోంగార్డు బి.ధన్‌సింగ్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

ఏటూరునాగారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైజంక్షన్ సమీపాన కొలువై ఉన్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవాహిత దేవతా, మండల మూల మంత్ర హోమాలు, విగ్రహ స్నపన కార్యక్రమాలు జరిగాయి.మధ్యాహ్నం నుంచి సాయం త్రం వరకు శయ్యాధివాసం, ధాన్యాధివాసం, ఫల పుష్ప ఆదివాసాలు, నిద్రాక లశ స్థాపన, చతుర్వేద స్వస్తి తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. బుధవారం అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం కార్యక్రమాలు జరగనున్నాయి.

యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు

వెంకటాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని రెండో ఎస్సై నర్సింహస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో పోలీసులు ఆటో డ్రైవర్లు, గ్రామస్థులకు డ్రగ్స్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నర్సింహస్వామి మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత బానిసలైతే వారి బంగారు భవిష్యత్ నాశనమవుతుందని అన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా డ్రగ్స్ అమ్మినా, కొనుగోలు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి : బీఆర్ఎస్

ఏటూరునాగారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మనర్సింహరావు(లక్ష్మణ్ బాబు) డిమాండ్ చేశారు. కలెక్టర్ టీఎస్. దివాకర్‌కు బీఆర్ఎస్ నాయకులు, ఏటూరునాగారం, మంగపేట మండలాల రైతులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో ఈనెల 13న కురిసిన వడగండ్ల వానకు సుమారు 3వేల ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందని, ధాన్యం రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వారందరికీ న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పోరిక గోవింద నాయక్, పార్టీ సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు, తుమ్మ పల్లారెడ్డి, మల్క రమేష్, వావిలాల పోశయ్య, తక్కెళ్లపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపంలో విధులు జాగ్రత్త

ట్రాఫిక్ కానిస్టేబుళ్లతో ఎస్పీ కిరణ్ ఖరే



ట్రాఫిక్ సిబ్బందితో ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిః దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు చలువ కళ్లద్దాలను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతినీల లోహిత కిరణాల వల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, అందుకు చలువ కళ్లద్దాలను ధరించాలని సూచించారు. ఎప్పటికప్పుడు తగినంత మంచినీరు తాగాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని అన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజిత, మాధవిలు అన్నారు. మండలంలోని మొట్లపల్లి, పర్లపల్లి సెక్టార్‌లోని నర్సింగాపూర్, ములుకలపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ దశ నుంచి పిల్లవాడు రెండేళ్లవరకు ఉన్న దశను గోల్డెన్‌దశ అంటారని, ఈదశలో సరైన పోషణ అందినట్లయితే 80శాతం మెదడు అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. బినిఫిషరీ రిజిస్ట్రేషన్ కూడా ఎప్పటికప్పుడు చేయించుకోవాలని, బరువు తక్కువ ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి బాలామృతం ప్లేస్ ఇస్తూ గృహ సందర్శనల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేయడంతోపాటు అక్షరాభ్యాసం చేయించారు.

ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం

ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్



కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రమేష్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఐక్యంగా ఉంటేనే కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ అన్నారు. కేటీకే 5 ఇన్‌క్లైన్‌లో మొదటి షిఫ్టు రిలే కార్మికులను మంగళవారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేకంగా కమిటీ ఉండాలని సూచించారు. ఈ నెల నిర్వహించే మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ డోర్నాల తిరుపతి, అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీలు ఆసిఫ్‌పాషా, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోప నివారణే లక్ష్యం

కాటారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపనివారణే పోషణ్ అభియాన్ లక్ష్యమని ఐసీడీఎస్ మహదేవ్‌పూర్ సీడీపీవో రాధిక, కాటారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో ఐసీడీఎస్ గంగారం, కాటారం సెక్టార్ల పరిధి అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి పోషణ్ అభియాన్ పక్షోత్సవ ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. 50 మందికి పైగా అంగన్వాడీ టీచర్లు పలు రకాల పండ్లు, కూరగాయలను, పోషకాహార పదార్థాలు, చిరుధాన్యాలను ప్రదర్శిస్తూ వాటితో కలిగే ప్రయోజనాలను మహిళలకు వివరించారు. సీడీపీవో రాధిక, డాక్టర్ మౌనిక, ఎంపీవో వీరస్వామి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు శివరాణి, వీణ, భాగ్యలక్ష్మి, నాగరాణి పెరటి తోటల పెంపకం, పౌష్టికాహార ఆవశ్యకత, చిరుధాన్యాలతో వంటలు, గర్భిణులు. బాలింతలకు 1000 రోజుల ప్రాముఖ్యతను వివరించారు. ఈకార్యక్రమాల్లో ఎంపీవో వీరస్వామి, సీహెచ్‌వో నిర్మల, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ స్వప్న, ఎన్‌జీవో సమ్మయ్య, జీపీ కార్యదర్శి రాకేష్ రెండు సెక్టార్ల పరిధి అంగన్‌వాడీ టీచర్లు, ఏడబ్ల్యూహెచ్‌లు, ఏఎన్ఎంలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శారదా విద్యాలయంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పరకాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పరకాల పట్టణంలోని శారదా విద్యాలయంలో మంగళవారం గ్రాడ్యు యేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వ హించారు. విద్యార్థులు పూర్వ ప్రాథమిక విద్యను ముగించుకొని ప్రాథమిక విద్యలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మార్క సత్యనారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు మెడల్స్, గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య, హైస్కూల్ విద్యకు తొలిమెట్టు వంటిదన్నారు. విద్యార్థులు, తల్లిదం డ్రులు, గురువుల మాట విని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుజిని, నిరోష, మం జుల, హైమావతి, స్వప్న, శృతి, వనిత, రజిత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్క సత్యనారాయణ

రైతులు ఇన్సూరెన్స్ కంపెనీలను సంప్రదించాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వడగళ్ల వానతో పంటలు నష్టపోయిన జిల్లాలోని రైతులు ఇన్సూరెన్స్ కంపెనీలను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పంట రుణం తీసుకున్న సమయంలో ఇన్సూరెన్స్ చేసినట్లయితే వారు సంబంధిత బ్యాంకులో కాని ఇన్సూరెన్స్ కంపెనీకి తెలియజేయాలని, దీంతో ఇన్సూరెన్స్ కంపెనీవారు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఇన్సూరెన్స్ కూడా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈవిషయాన్ని జిల్లాలోని రైతులు గమనించి ఇన్సూరెన్స్ కంపెనీలను సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ‘పోషణ్ పక్వాడ’



పోషణ్ పక్వాడ కార్యక్రమంలో అంగన్‌వాడీలు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని శాంతినగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత హాజరై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం పిల్లలకు, తల్లులకు, గర్భిణులకు అందించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు తీసుకొచ్చిన పోషకాహారం పదార్థాలను వారికి చూపించి పోషక విలువలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, పుష్పలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన బైక్.. యువకుడికి తీవ్రగాయాలు

కాటారం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటారం-మంథని 4లేన్ రోడ్డుపై జిన్నింగ్ మిల్లు సమీపంలో మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న డివైడర్ మధ్యలోకి దూసుకెళ్లింది. దీంతో మల్హర్ మండలం వల్లెంకుంటకు చెందిన అశోక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై అశోక్ వేగంగా కాటారం మండల కేంద్రం వైపు వెళ్తుండగా అదుపుతప్పి బైక్ డివైడర్ అంచును ఢీకొని ఎగిరి మధ్యలోపడింది. బైక్ డివైడర్ తాకి మధ్యలోకి దూసుకెళ్తున్న క్రమంలో వాహనంపై ఉన్న అశోక్ ఎగిరి రోడ్డుపై పడటంతో తల, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. ఇతర వాహనదారులు గమనించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం.. గిరిజన మహిళకు తీవ్ర గాయం



గాయపడిన స్వరూప

కాటారం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్ నిర్లక్ష్యం ఓ గిరిజన మహిళ తీవ్రంగా గాయ పడిన సంఘటన మండలంలోని మేడి పల్లి వద్ద జాతీయ రహదారి- 353(సీ)పై మంగళవారం చోటుచేసు కుంది. భూపాలపల్లి డిపో బస్సు డోర్ నుంచి దిగే క్రమంలో పులి స్వరూప అనే మహిళ కిందపడింది. బస్సు టైర్ కాలుపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాల య్యాయి. స్వరూప మేడిపల్లిలో ఉన్న కూతురిని చూడటానికి భూపాలపల్లిలో బస్సు ఎక్కింది. మేడిపల్లి స్టేజీ వద్దకు రాగానే స్వరూప లేచి డోర్ వద్దకు వచ్చి ఆపమని అడిగింది. డ్రైవర్ ఇక్కడ స్టేజీ లేదని బస్వాపూర్‌లో దిగాలని చెప్పాడు. అంత దూరం నుంచి నడిచి రాలేనని ఆర్టీసీ బస్సులు ఆపుతారు కదా? అని డ్రైవర్, కండక్టరును ఆమె బతిమిలాడింది. కండక్టర్ సరే దిగమని చెప్పగా అందుకు ప్రయత్నిస్తుండగానే డ్రైవర్ ఒక్కసా రిగా బస్సును పోనివ్వడంతో మహిళ కిందపడింది. కాలుపై నుంచి బస్సు టైర్ ఎక్కడంతో విరిగింది. బాధితురాలిని భూపాల పల్లి 100పడకల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు మాజీ స్పీకర్ శ్రీపాదరావు మేడిపల్లి స్టాప్ పెట్టించారని, డిపో మేనేజర్‌కు ఎన్నో సార్లు విన్నవించినా పట్టించుకోలేదని మాజీ సర్పంచ్ లిక్కి లావణ్య శ్రీనివాస్, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. టోల్‌గేట్‌కు ముందే ఉన్న మేడిపల్లిలో ఆపితే ఆర్టీసీకి ఆ చార్జీలు రావని బస్సులు ఆపడం లేదని మండిపడ్డారు. ప్రమాదానికి ఆర్టీసీ అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

‘యువ వికాసం’కు 1,350 దరఖాస్తులు

మహాముత్తారం, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి వరకు ఆన్‌లైన్‌లో 1,350 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో 1, 200 మంది దరఖాస్తులను ఎంపీడీవో కార్యాయం హెల్ప్ డెస్క్‌లో అందజేశారని పేర్కొన్నారు. 150 మంది ఇంకా దరఖాస్తులను అందజేయవల్సి ఉందన్నారు. దరఖాస్తులు చేయని వారు బుధవారం సాయంత్రంలోగా అందజేయాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

మహదేవపూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : మంథని నియోజకవర్గంలోని మహదేవపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన నగేష్ యాదవ్‌ను మంగళవారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడి లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుడాల శ్రీనివాస్, కాళేశ్వరం మాజీ ఎంపీటీసీ రేవెల్లి మమత నాగరాజ్, రవిచంద్ర పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు చేస్తున్న బీఆర్ఎస్

యువజన కాంగ్రెస్

మంగపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యం వల్ల కురిసిన వడగాళ్ల వానకు మండలంలోని మొట్లగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతు నర్సింహారావు మృతి చెందడం చాలా బాధకరమని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మురుకుంట్ల నరేందర్, చెట్టుపల్లి ముకుందం, బాడిశ ఆదినారాయణ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు నర్సింహారావుది ఆత్మహత్య కాదని ప్రభుత్వ హత్యగా చిత్రీకరిస్తూ చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. మంగపేటలోని కాంగ్రెస్ భవనంలో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ మండల అత్యవసర సమావేశం మంగళవారం జరిగింది. ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు బోడ జయరాజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ మండల నాయకులు నాగార్జున, జి.సాయి, కె. ముకుందం, వై.నరేష్, ఎం. ప్రవీణ్, ఎం. చంటి, ఎల్వీ. కిరణ్, శివప్రసాద్, కె.లక్ష్మణ్, ఎం. నరేష్, బి. నరేష్, జి. మురళి, బి. రాము, బిక్షపతి, ఎన్. రాజు, బి. కుమార్, చైతన్య, శేషు, సంజయ్, జి. నరేష్, మహేష్, ఎల్వీ. రమేష్, లాలేందర్, ప్రియకుమార్, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.